క్లుప్తంగా

పాఠశాలలోనే భోజనం చేయాలి

అంబాజీపేట: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నాణ్యమైన మధ్యాహ్న భోజనాన్ని ప్రతి విద్యార్థి సంతృప్తిగా తినాలని ఎంఈఓ ఎం.ప్రకాష్ అన్నారు. అంబాజీపేట నాగాబత్తులవారిపాలెంలో ఉన్న ప్రాథమిక పాఠశాలను బుధవారం ఆయన పరిశీలించారు. ఎంఈఓ మాట్లాడుతూ ప్రభుత్వ మెనూ ప్రకారం పౌష్టికాహారాన్ని విద్యార్థులకు అందిస్తున్నారని దానిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పాఠశాల ప్రాంగణంలో ఉన్న భారీ వృక్షాలు స్కూల్ భవనంపై వాలి ప్రమాదభరితంగా ఉన్నాయని వాటిని తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని హెచ్ఎం బి.చిట్టిబాబు కోరారు. అనంతరం విద్యార్థులతో సహపంక్తి భోజనం చేశారు.

వస్తువుల కొనుగోలుపై అవగాహన ఉండాలి

అంబాజీపేట: వస్తువులు కొనుగోలు చేసే సమయంలో తూనికలు, కొలతలు, ధర నిర్ధారణ తదితర వాటిపై పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలని తహసీల్దార్ టి.మంగతాయారు, కోనసీమ కన్జ్యూమర్స్ ఆర్గనైజేషన్ ఫెడరేషన్ అధ్యక్షుడు అరిగెల బలరామమూర్తి అన్నారు. అంబాజీపేట జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులు వినియోగదారుల వస్తుసేవల వినియోగంపై అవగాహన సదస్సును హెచ్ఎం కె.సాయిరామ్ అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. విద్యార్థులతో వినియోగదారుల వస్తు సేవల వినియోగం అవగాహన కమిటీని ఏర్పాటు చేశారు. సదస్సులో ఆర్‌ఐ ఇబ్రహీం, ఉపాధ్యాయులు వి.సత్యనారాయణ, బి.వెంకటేశ్వరరావు, ఎండీ.బేగం, బీఎస్ఎన్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్రాకు దరఖాస్తుల స్వీకరణ

ఆలమూరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న ఆడుదాం ఆంధ్రా కార్యక్రమానికి అర్హులైన క్రీడాకారుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తహసీల్దార్ ఐపీ శెట్టి తెలిపారు. ఆయన మాట్లాడుతూ అక్టోబర్ పదిన ప్రారంభమయ్యే ఈ కార్యక్రమం గ్రామ సచివాలయ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకూ నిర్వహిస్తామన్నారు. ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, క్రికెట్, బ్యాడ్మింటన్ క్రీడలను నిర్వహించనున్నామన్నారు. 17 ఏళ్ల దాటిన యువకులు ఈ పోటీలకు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఆత్రేయపురంలో..

ఆత్రేయపురం: అక్టోబర్ 2 నుంచి 7 వరకు జరిగే ఆడుదాం–ఆంధ్రా ఆటల పోటీల్లో యువతీ యువకులు పాల్గొనేలా కృషి చేయాలని ఎంపీడీఓ నాతిబుజ్జి, తహసీల్దార్ అనిల్‌కుమార్ అన్నారు, స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఆడుదాం–ఆంధ్రా టోర్నమెంట్‌పై సమీక్షించారు. అసిస్టెంట్ ఇంజినీర్లు, వీఆర్వోలకు నిర్వహించిన సమీక్షలో ఆటల పోటీల్లో 17 సంవత్సరాలు నిండిన యువతీయువకులు పోటీల్లో పాల్గొనేలా గ్రామాల్లో అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓలు వరప్రసాద్, పచ్చా సాహెబ్, పీఈటీలు నంబూరి రవిరాజు, శ్రీకాంత్, వై.శ్రీనివాసరావు, శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

అయినవిల్లిలో..

అయినవిల్లి: క్రీడలతో విద్యార్థుల్లో మానసికోల్లాసం అలవడుతుందని స్థానిక ఎంపీడీఓ తాడి శ్రీవెంకటాచార్య, తహసీల్దార్ సీహెచ్ నాగలక్ష్మమ్మ అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ప్రభుత్వ పాఠశాలల్లో వ్యాయామోపాధ్యాయులకు ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంపై అవగాహన కల్పించారు. వీరు మాట్లాడుతూ గ్రామాల్లోని విద్యార్థులతో ఆటలపై ఆసక్తి పెంచాలన్నారు.

ధ్వజస్తంభం జీర్ణోద్ధరణ పూజలు



ఆదుర్రులో నిర్వహిస్తున్న ధ్వజస్తంభం జీర్ణోద్ధరణ పూజలు

మామిడికుదురు: ఆదుర్రులోని పురాతన సర్వమంగళ పార్వతీ విశ్వేశ్వరస్వామి ఆలయం ప్రాంగణంలోని ధ్వజస్తంభం జీర్ణోద్ధరణ పూజలను బుధవారం ఘనంగా నిర్వహించారు. భక్తుల కోలాహలం, వేద మంత్రోచ్ఛారణ నడుమ జేసీబీ సహాయంతో ధ్వజస్తంభాన్ని జీర్ణోద్ధరణ చేశారు. ఈదరాడకు చెందిన పూజ్యం జగన్నాథశర్మ ఆధ్వర్యంలో ఆలయ సింగిల్ ట్రస్టీ పూజ్యం వెంకటేశ్వరశర్మ సారథ్యంలో గణపతి పూజ, పుణ్యాహవాచనం, హోమం తదితర పూజలను శాస్త్రోక్తంగా జరిపించారు. పలువురు భక్తులు ఈ పూజల్లో పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

రాజోలు: విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో చేపట్టనున్న విద్యుత్ మరమ్మతుల కారణంగా ఈ నెల 24న విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు ఏఈ ఎం.రవికుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్‌డబ్ల్యూఎస్ 11 కేవీ వాటర్ వర్క్స్ ఫీడర్ పనులు చేపడతామన్నారు. దీని కారణంగా చింతలపల్లి, బి.సావరం గ్రామాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామన్నారు.

గుడ్‌టచ్ బ్యాడ్‌టచ్‌పై అవగాహన

కొత్తపేట: స్థానిక జెడ్పీ బాలికల హైస్కూల్‌లో బుధవారం పోలీసులు విద్యార్థులకు గుడ్‌టచ్ బ్యాడ్‌టచ్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అదనపు ఎస్సై శశాంక, కాకినాడ దిశా స్టేషన్ ఉమెన్ హెచ్‌సీ లలిత, పీసీ శంకర్ విద్యార్థులకు దిశా, పోక్సో, చైల్డ్ మ్యారేజ్, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు.

ఫిర్యాదుల డబ్బాలు తీస్తున్నారా?

- ప్రైవేట్ ట్రస్ట్ ఫిర్యాదుల డబ్బాలో ఉపాధ్యాయుడిపై ఫిర్యాదు
- ప్రతి 15 రోజులకు విధిగా తెరిచేలా చర్యలు



కొత్తపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఫిర్యాదు డబ్బా తెరిపిస్తున్న ఎంఈఓ హరిప్రసాద్

కొత్తపేట: ప్రభుత్వ పాఠశాలల్లో వివిధ సమస్యలు, బాలలు ముఖ్యంగా బాలికలకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి సంబంధించి ఫిర్యాదుల డబ్బాలు తెరచుకోకుండా మొక్కుబడిగా ఉన్నాయి. రాష్ట్రంలో సీఎం జగన్ నాయకత్వంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టాక ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే పేద, మధ్యతరగతి విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించే లక్ష్యంతో ‘మనబడి నాడు–నేడు’ పథకం కింద పాఠశాలల అభివృద్ధి, మౌలిక సదుపాయాలు కల్పించిన విషయం తెలిసిందే. ప్రతి ఒక్కరూ చదువుకోవాలనే లక్ష్యంతో అమ్మ ఒడి పథకం కింద ఆర్థిక ప్రోత్సాహం, జగనన్న విద్యాకానుక సమకూర్చిన విషయం కూడా తెలిసిందే. అంతే కాకుండా ఎవరికి ఏ సమస్య తలెత్తినా, ఎవరి వల్ల ఏ ఇబ్బందులు ఎదురైనా, పాఠశాలలో ఏ విధమైన అసౌకర్యం కలిగినా, బాలికలను ఎవరైనా లైంగిక వేధింపులకు గురిచేసినా నేరుగా ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులకు చెప్పలేనివారు అధికారుల దృష్టికి తీసుకువెళ్లేందుకు పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వుల మేరకు ఫిర్యాదుల డబ్బాలు కూడా ఏర్పాటు చేశారు. ప్రతి 15 రోజులకు మండలంలో పాఠశాలల ఫిర్యాదుల డబ్బాలను మండల పరిషత్ కార్యాలయంలో మండల టీమ్ ఎంపీడీఓ, తహసీల్దార్, ఎంఈఓ, సీడీపీఓ, ఎస్సై సమక్షంలో తెరిచి, వాటిలో ఉన్న ఫిర్యాదులపై తగు చర్యలు తీసుకోవాలి. అలా సాధ్యం కాక గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శి, హెచ్ఎం సమక్షంలో ఆ డబ్బాలను విధిగా తెరిచి విద్యార్థుల సూచనలు, సమస్యలకు సంబంధించి ఫిర్యాదులను ఉన్నతాధికారులకు నివేదించి పరిష్కరించేవారు. తరువాత అనేక పాఠశాలల్లో ఆ బాక్సులను తెరవడం మానేశారు.

చారిటబుల్ ట్రస్ట్ ద్వారా వెలుగు చూసిన ఫిర్యాదులు

మండలంలోని వాడపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఈ నెల 7 నుంచి 9 వరకూ మూడు రోజుల పాటు పదాల చారిటబుల్ ట్రస్ట్, కృత ఫౌండేషన్ సంయుక్తంగా వివిధ అంశాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. దానిలో భాగంగా మీకు ఏమైనా ఇబ్బందులు ఉంటే రాసి ఈ డబ్బాలో వేయాలని ఒక ఫిర్యాదుల డబ్బా ఏర్పాటు చేశారు. ఆ మేరకు పలువురు విద్యార్థినులు ఒక ఉపాధ్యాయుడు తమపై అసభ్యంగా ప్రవర్తిస్తున్నారని పేర్కొంటూ స్లిప్స్ వేశారు. ఆ ట్రస్ట్ వారు కలెక్టర్ హిమాన్షుశుక్లా దృష్టికి తీసుకువెళ్లడం, దీనిపై తీవ్రంగా స్పందించిన కలెక్టర్ స్థానిక తహసీల్దార్‌ను విచారణకు ఆదేశించడం, ఆయన విద్యార్థినులను విచారించి, కలెక్టర్‌కు నివేదించడం, కలెక్టర్ సూచనలతో డీఈఓ ఆదేశాల మేరకు గురువారం రాత్రి పాఠశాల హెచ్ఎం పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం కూడా తెలిసిందే.

స్పందించిన విద్యాశాఖ

పాఠశాలల్లో ఫిర్యాదుల డబ్బాలు ఉన్నా వాటిని క్రమపద్ధతిలో తెరవకపోవడంతో ప్రైవేట్ ట్రస్ట్ వారి ఫిర్యాదుల డబ్బా ద్వారా విద్యార్థినులకు తలెత్తిన సమస్య, వారి ఆవేదన వెలుగు చూడటంతో విద్యాశాఖ అధికారులు పాఠశాలల్లో ఫిర్యాదుల డబ్బాలపై దృష్టి పెట్టారు. దానిలో భాగంగా శుక్రవారం స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో ఫిర్యాదుల డబ్బాను ఎంఈఓ హరిప్రసాద్ ఆధ్వర్యంలో గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శి జె.లక్ష్మీతేజస్వి ఫిర్యాదుల డబ్బా తెరిచి, పలువురు పేర్కొన్న సమస్యలను ఫిర్యాదుల పుస్తకంలో నమోదు చేశారు. అలాగే పలు పాఠశాలల్లో ఫిర్యాదుల డబ్బాలపై దృష్టి పెట్టారు.



పాఠశాలలో ఫిర్యాదుల డబ్బా

విధిగా ఫిర్యాదులపై చర్యలు

విధిగా ప్రతి 15 రోజులకు పాఠశాలల్లో ఫిర్యాదుల డబ్బాలు తెరవాలని హెచ్ఎంలకు ఆదేశాలు జారీ చేశాం. తాము కూడా పర్యవేక్షిస్తూ ఫిర్యాదుల డబ్బాలో విద్యార్థులు వేసిన ఫిర్యాదులపై తగు చర్యలు తీసుకుంటాం. అవసరం మేరకు ఉన్నతాధికారులకు నివేదిస్తాం.

– ఎం.హరిప్రసాద్, ఎంఈఓ, కొత్తపేట

భారీ వర్షం.. స్తంభించిన జనజీవనం



వర్షానికి నిర్మానుష్యంగా దర్శనమిస్తున్న అంబాజీపేట రహదారి

అంబాజీపేట: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా బుధవారం ఉదయం 9 నుంచి 10.30 గంటల వరకు భారీ వర్షం కురిసింది. ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి జన జీవనం స్తంభించింది. పలు గ్రామాల్లో రహదారులపై నీరు నిలిచిపోయాయి. వేసవిని తలపిస్తున్న అధిక ఉష్ణోగ్రతలతో అల్లాడిన ప్రజలకు ఈ వర్షంతో సేదతీరారు. వర్షం కారణంగా బుధవారం నిర్వహించే వారపు సంత, పశువుల సంత వెలవెలబోయింది. కొబ్బరి వ్యాపార లావాదేవీలు మందకొడిగా సాగాయి. కొబ్బరితోటలకు సరైన నీరు అందక బీటలు వారిన చేలకు ఈ వర్షం ఎంతో ఉపయోగపడతుందని రైతులు చెబుతున్నారు.

చంద్రయాన్-3 విజయవంతంపై హర్షాతిరేకాలు

రాజోలు: చంద్రయాన్–3 విజయవంతంగా చంద్రుడిపై ల్యాండ్ కావడంతో బుధవారం పలువురు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. రాజోలు గాంధీబొమ్మ సెంటర్ వద్ద స్థానిక పెద్దలు కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు. రాజోలు రోటరీక్లబ్ మాజీ అధ్యక్షుడు దార్ల పెదబాబు, అక్కిరెడ్డి సుబ్రహ్మణ్యం, జొన్నలగడ్డ గోపాలకృష్ణ, రోటరీ కార్యదర్శి చిట్నీడి లక్ష్మణరావు, మాజీ సర్పంచ్ కసుకుర్తి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ విధానంలో గానోడెర్మా నివారణ



కొబ్బరిలో ప్రకృతి వ్యవసాయ విధానంపై అవగాహన కల్పిస్తున్న ప్రాజెక్టు మేనేజరు ఎలియాజరు

మలికిపురం: ప్రకృతి వ్యవసాయ విధానం ద్వారా కొబ్బరిలో గానోడెర్మా తెగుల నివారణ సాధ్యపడుతుందని ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు జిల్లా మేనేజర్ ఎలియాజరు పేర్కొన్నారు. మలికిపురం మండలం గుబ్బలపాలెం, సఖినేటిపల్లి మండలం మోరి గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయ విధానంలో కొబ్బరి తెగుళ్ల నివారణపై రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో ఎలియాజర్ పాల్గొని ప్రసంగించారు. కొబ్బరిని దీర్ఘకాలికంగా వేధిస్తున్న తెగుళ్లకు ప్రకృతి వ్యవసాయ విధానంలో జీవామృతం ఎరువుల వాడకం ద్వారా ఫలితాలు వస్తున్నట్లు వివరించారు. మెరికో పేరాషూట్ సంస్థ ప్రతి నిధులు అరవింద్, ప్రదీప్ తదితరులు రైతులకు అవగాహన కల్పించారు. గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయ పద్ధతులు అనుసరించి సాగుచేస్తున్న కొబ్బరి రైతుల తోటలను పరిశీలించి కొబ్బరిలో వచ్చే తెగుళ్ల పురుగులు, నల్లి తెల్ల దోమ గానోడెర్మా ఉధృతి పరిశీలించారు. 30 ఎకరాల కొబ్బరిలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతు కొల్లాబత్తుల విజయానంద్ పొలాలను బృందం పరిశీలించింది. మేలు రకమైన యాజమాన్య పద్ధతులు, పురుగులు, తెగుళ్ల యాజమాన్య పద్ధతుల గూర్చి రైతులకు వివరించారు. ప్రకృతి వ్యవసాయ రైతులకు కావలసిన ప్రోత్సాహం అందిస్తామని ఎలియాజరు రైతులకు తెలిపారు. అడిషనల్ డీపీఎం సత్యనారాయణ, ప్రకృతి వ్యవసాయ ఏఓ శ్రీనివాస్, సిబ్బంది జోష్, ప్రసాద్ ఎ.అనంతకుమార్, యూనిట్ ఇంచార్జి జూలీ, రైతులు పాల్గొన్నారు.

మాజీ చైర్మన్ ఆరోపణలు అర్ధరహితం



సమావేశంలో మాట్లాడుతున్న రుద్రరాజు రమేష్‌రాజు

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా భాసిల్లుతున్న వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయానికి సంబంధించి మాజీ చైర్మన్ చేసిన ఆరోపణలు అర్ధరహితమని, అపరిపక్వతతో కూడుకున్నవని ఆలయ చైర్మన్ రుద్రరాజు రమేష్ విమర్శించారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మాజీ చైర్మన్‌తో పాటు పలువురు చేసిన ఆరోపణలను ఖండించడంతో పాటు కొన్ని ప్రశ్నలను సంధించారు. నియోజకవర్గ, ఆలయ అభివృద్ధికి నిరంతం శ్రమిస్తున్న ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డిపై నిరాధార ఆరోపణలు చేయడం దురదృష్టకరమన్నారు. తనకు బాకీ ఉన్నందుకే చైర్మన్ పదవిని కేటాయించారన్న ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నానన్నారు. పవిత్ర పుణ్యక్షేత్రంగా భాసిల్లుతున్న ఆలయంపై విచక్షణ లేని ఆరోపణలు చేయడం దారుణమన్నారు. దేవస్థానం అభివృద్ధిపై చర్చిద్దామన్న ప్రతిపాదనలకు తాము సిద్ధమేనని, ఎవరి హయాంలో ఆలయం అభివృద్ధి చెందిందో ప్రజలకు, భక్తులకు తెలుసన్నారు. ఎమ్మెల్యే జగ్గిరెడి సహకారంతో రూ.కోట్లు ఖర్చుచేసి ఆలయాన్ని సర్వాంగా సుందరంగా తయారు చేయడంతో పాటు భక్తులకు మౌలిక వసతులు కల్పించిన సంగతిని ఆయన గుర్తు చేశారు. వాడపల్లి దేవస్థానం చైర్మన్ పదవికి ఆత్రేయపురం మండలంలో సరైన నాయకులు లేక పక్క మండలం నుంచి తీసుకొన్నట్లు చేసిన ఆరోపణలపై గత టీడీపీ ప్రభుత్వ హయాంలో రాజమహేంద్రవరానికి చెందిన ఒక వ్యక్తిని సభ్యుడిగా నియమించినప్పుడు ఈ విషయం గుర్తుకు రాలేదేమిటని ప్రశ్నించారు. రాజమహేంద్రవరం నుంచి ఒక ట్రస్టు బోర్డు మెంబర్‌ను ఏ ప్రాతిపదికన తీసుకొన్నారో చెబితే బాగుంటుందన్నారు. జాతీయ స్థాయిలో వాడపల్లి వెంకన్న కీర్తి వెలుగొందుతుంటే మీరు కనీసం ప్రసార మాధ్యమాల్లో చూసైనా మారకపోవడం దురదృష్టకరమన్నారు. ఎమ్మెల్యేగా జగ్గిరెడ్డి ఎన్నికైన వెంటనే తన మొదటి గ్రాంటును వాడపల్లి వెంకన్న ఆలయానికి ఇచ్చారన్నారు. అలాగే వాడపల్లి వెంకన్న ఆశీస్సులు అందరికీ ఉండి అందరూ ఆయురారోగ్యాలతో ఉండాలన్నారు. తొలుత సర్పంచ్ పోచిరాజు బాబూరావు మాట్లాడుతూ గత నాలుగేళ్లలో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ఆలయం అభివృద్ధి చెందిందన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పెన్మెత్స సురేష్‌రాజు, మెర్ల వెంకటేశ్వరరావు, కనకారావు తదితరులు పాల్గొన్నారు.

మాతృభాషా వారోత్సవాలు



తొండవరంలో మాతృభాషా వారోత్సవాల్లో అలరించిన విద్యార్థులు

అంబాజీపేట: గిడుగు రామ్మూర్తి పంతులు జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని తొండవరం జెడ్పీ హైస్కూల్‌లో మాతృ భాషా వారోత్సవాలను హెచ్ఎం పీవీ కేశవచార్యుల పర్యవేక్షణలో బుధవారం ప్రారంభించారు. తొలుత గిడుగు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తెలుగు భాషా పండితుడు, తెలుగు రైతు, రామ్మూర్తి వేషధారణలో విద్యార్థులు పలువురిని అలరించారు. అనంతరం తెలుగు ఉపాధ్యాయులు ముషిణి వెంకటేశ్వరరావు, పినిపే సత్యనారాయణల ఆధ్వర్యంలో తెలుగు పద్యాలు, సామెతలపై పోటీలు నిర్వహించారు. బి.శ్రీరామాంజనేయులు, ఎం.చంద్రరావు, ఎం.రాంబాబు, పి.వెంకటేశ్వరరావులు న్యాయ నిర్ణేతగా వ్యవహరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

‘గిడుగు’ చిరస్మరణీయుడు

రాజోలు: తెలుగు భాషా కోవిదుడు గిడుగు వెంకట రామ్మూర్తి పంతులు చిరస్మరణీయుడని రాజోలు డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సాయిబాబు అన్నారు. బుధవారం గిడుగు రామ్మూర్తి పంతులు జయంతి నిర్వహించారు. తెలుగు భాషా వారోత్సవాలు ఈ నెల 29వ తేదీ వరకు కళాశాలలో జరుగుతాయని ప్రిన్సిపాల్ సాయిబాబు వివరించారు. తెలుగు భాషా విభాగాధిపతి పి.శైలజ, అధ్యాపకులు శ్రీరామ్మూర్తి, భాస్కరరావు, నల్లి రాజు తదితరులు పాల్గొన్నారు.

వైద్య పరీక్షల్లో నిర్లక్ష్యం వద్దు



పుల్లేటికుర్రులో వైద్య సిబ్బందికి సూచనలు చేస్తున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి దుర్గారావుదొర

అంబాజీపేట: ఆస్పత్రికి వచ్చే రోగులకు అన్ని రకాల వైద్య పరీక్షలు చేయాలని, వాటిపై నిర్లక్ష్యం వద్దని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఎం.దుర్గారావుదొర అన్నారు. ముక్కామల, పుల్లేటికుర్రు, మొసలపల్లి సచివాలయాల్లో నిర్వహిస్తున్న ఆరోగ్య కేంద్రాలను బుధవారం ఆయన సందర్శించారు. దుర్గారావుదొర మాట్లాడుతూ ప్రస్తుత వాతావరణంలో ప్రజలు రోగాల బారిన పడుతున్నారని వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. గ్రామాల్లో ఇంటింటా సర్వే చేసి జ్వర రోగులతో పాటు ఇతర వ్యాధిగ్రస్తులను గుర్తించి వారికి పూర్తి స్థాయిలో వైద్యం, మందులు అందించాలన్నారు. సచివాలయాల్లో రోగులకు అవసరమైన మందులన్నింటిని అందుబాటులో ఉంచాలన్నారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని క్రమం తప్పకుండా అమలు చేయాలన్నారు. అంతకుముందు ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీ రికార్డులను పరిశీలించి తగు సూచనలు చేశారు. ముక్కామల పీహెచ్‌సీ వైద్యాధికారి జి.రమ్యశైలజ, ఎంపీహెచ్‌ఈవో ఆర్.రామకృష్ణ, హెల్త్ సూపర్‌వైజర్ చందు, ఎం.వెంకటేశ్వరరావు, రవిశంకర్, ఏఎన్ఎంలు, ఆశాలు ఆయన వెంట ఉన్నారు.

ఓటర్ జాబితా అభ్యంతరాలపై అవగాహన

కొత్తపేట: మండలంలోని బూత్‌స్థాయి అధికారులకు, సూపర్‌వైజర్లకు స్థానిక రెవెన్యూ డివిజన్ అధికారి కార్యాలయంలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఆర్‌డీఓ ఎం.ముక్కంటి, కొత్తపేట తహసీల్దార్ జీడీ కిషోర్‌బాబు సిబ్బందికి పలు సూచనలు చేశారు. గత నెల 21 నుంచి ఈ నెల 21వ తేదీ వరకు ఇంటింటికీ జరిగిన పరిశీలనలో వచ్చిన అభ్యంతరాలపై పలు సూచనలు చేశారు. మరణాలు, గ్రామాంతరాలు, నకిలీ ఓట్లు, ఒకే డోర్ నంబర్‌లో 10 కంటే ఎక్కువ ఓట్లు కలిగిన వారికి ఫార్మేట్–8 ద్వారా డోర్ నంబర్లు సవరణ చేయడం తదితర అంశాలపై బూత్‌స్థాయి అధికారులకు, సూపర్‌వైజర్లకు పలు సలహాలు చేశారు. సమావేశంలో ఆర్‌డీఓ ఎం.ముక్కంటి, తహసీల్దార్ కిషోర్‌బాబు, డీటీ ఎం.శ్రీనివాసు, ఎన్నికల సీనియర్ సహాయకురాలు అర్ధమ్మ, బీఎల్‌ఓలు తదితరులు పాల్గొన్నారు.

చంద్రయాన్ లైవ్ వీక్షించిన విద్యార్థులు



మొగలికుదురు ఉన్నత పాఠశాలలో చంద్రయాన్ ప్రత్యక్ష ప్రసారం వీక్షిస్తున్న విద్యార్థులు

మామిడికుదురు: భారత కీర్తి కిరీటంలో కలికితురాయిగా నిలిచిన చంద్రయాన్–3 ప్రయోగం విజయవంతం కావడంతో ప్రతి ఒక్కరూ ఆనందంతో ఉప్పొంగిపోయారు. ప్రపంచ దేశాలకు ఏ మాత్రం తగ్గని రీతిలో భారత శాస్త్రవేత్తలు చంద్రయాన్–3 ప్రయోగం ద్వారా నిరూపించారని పలువురు ప్రముఖులు పేర్కొన్నారు. చంద్రయాన్–3 రోవర్ చంద్రుడిపై కాలుమోపిన క్షణాన్ని ప్రజలు ఉప్పొంగిపోయారు. ఈ మధుర ఘట్టాలను వీక్షించేందుకు మొగలికుదురు జెడ్పీ ఉన్నత పాఠశాలతో పాటు మామిడికుదురు దీప్తి స్కూల్‌లోను ప్రత్యక్ష ప్రసారం ఏర్పాటు చేశారు. చంద్రయాన్–3 ప్రయోగం విజయవంతం కాగానే విద్యార్థులు ఆనందంతో ఉప్పొంగిపోయారు. జయహో భారత్, జయహో ఇస్రో అంటూ బిగ్గరగా నినాదాలు చేశారు. ప్రయోగం విజయవంతం కావడంనూ ప్రతి ఒక్కరూ హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు.

జీవో అమలు కోరుతూ కేశ ఖండన కార్మికుల ఆందోళన



అప్పనపల్లిలో నిరసన తెలుపుతున్న కేశ ఖండన కార్మికులు

మామిడికుదురు: ప్రభుత్వం విడుదల చేసిన జీవో 110ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ అప్పనపల్లి బాలబాలాజీ స్వామి దేవస్థానం కేశ ఖండన కార్మికులు బుధవారం ఆందోళన నిర్వహించారు. ఆలయం వద్ద కుటుంబ సభ్యులతో కలిసి నిరసన తెలిపారు. ప్రభుత్వం జీవో విడుదల చేసి నాలుగు నెలలు కావస్తున్నా దాన్ని ఇంత వరకు అమలు చేయలేదని వాపోయారు. స్వామి వారి ఆలయంలో 37 మంది కేశ ఖండన కార్మికులుగా పని చేస్తున్నామన్నారు. నెలకు కనీసం రూ.20 వేలు కమీషన్‌గా చెల్లించాలని డిమాండ్ చేశారు. జీవో అమలుకు శుక్రవారం సాయంత్రం వరకు గడువు ఇస్తున్నామని లేని పక్షంలో శనివారం నుంచి కేశ ఖండనను బహిష్కరిస్తామని అల్టిమేటం జారీ చేశారు. ఈ నిరసనలో సంఘం అధ్యక్షుడు రామేశ్వరపు నాగవీవీ సత్యప్రసాద్, కార్యదర్శి పసలపూడి వీవీ దుర్గారావు, గౌరవాధ్యక్షుడు కాజులూరి సత్యనారాయణమూర్తి, కోశాధికారి రామేశ్వరపు శ్రీనివాస్ పాల్గొన్నారు.

గంజాయి తాగుతున్న సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ అరెస్టు

పి.గన్నవరం: స్థానిక అక్విడెక్టు వద్ద గంజాయి సేవిస్తున్న ఒక సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌ను బుధవారం అరెస్టు చేసినట్టు ఎస్సై హరికోటి శాస్త్రి తెలిపారు. రాజోలు మండలం శివకోడు గ్రామానికి చెందిన ఆ యువకుడు హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నాడు. బుధవారం సాయంత్రం అతడు స్థానిక అక్విడెక్టు విద్యుత్ టవర్ వద్ద గంజాయితో నింపిన సిగరెట్ కాలుస్తూ ఉండగా పట్టుకున్నారు. అతని నుంచి 10 గ్రాముల గంజాయితో పాటు ఒక సిగరెట్ ప్యాకెట్‌ను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై హరికోటి శాస్త్రి వివరించారు.

ఆంధ్రకేసరిని ఆదర్శంగా తీసుకోవాలి



ప్రకాశం పంతులు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డీఎల్‌డీఓ మందా ప్రభాకరరావు



పి.గన్నవరంలో ప్రకాశం పంతులు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంపీపీ భూలక్ష్మి

అంబాజీపేట: ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు ఆంధ్రజాతికి ఎంతో త్యాగం చేశారని ఆయనను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని హెచ్ఎం పాణింగపల్లి వెంకట కేశవాచార్యులు అన్నారు. తొండవరం జెడ్పీ హైస్కూల్‌లో ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తొలి సీఎంగా ప్రకాశం పంతులు పదవి నిర్వహించి ఇతరులకు ఆదర్శంగా నిలిచారన్నారు. అంతకుముందు ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో స్టాఫ్ సెక్రటరీ ఎం.రాంబాబు, బి.శ్రీరామాంజనేయులు, మానుకొండ చంద్రరావు, కె.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అయినవిల్లిలో..

అయినవిల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి బుధవారం డీఎల్‌డీఓ మందా ప్రభాకరరావు ఆధ్వర్యంలో ఎంపీడీఓ తాడి శ్రీవెంకటాచార్య ఘనంగా జరిపారు. తొలుత డీఎల్‌డీఓ ప్రభాకరరావు ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. డీఎల్‌డీఓ ప్రభాకరరావు మాట్లాడుతూ ప్రకాశం సేవలను వివరించారు. కార్యక్రమంలో మండల పరిషత్ సూపరింటెండెంట్ దీక్షితులు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పి.గన్నవరంలో...

పి.గన్నవరం: టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి ఎంపీపీ అంబటి భూలక్ష్మి, ఎంపీడీఓ ఎం.భారతి తదితరులు పూలమాల వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో డీఎల్పీఓ భమిడి శివమూర్తి, ఈఓపీఆర్డీ జి.మంగాదేవి, ఏఓ వీఎస్‌వీ శర్మ, రామకృష్ణ, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కొత్తపేటలో..

కొత్తపేట: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం వద్ద బుధవారం టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని ఘనంగా నిర్వహించారు. మండల పరిషత్ అధ్యక్షుడు మార్గన గంగాధరరావు, అముడా చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు, అవిడి సర్పంచ్ రెడ్డి రామ వెంకట సుబ్రహ్మణ్యం, మండల పరిషత్ సిబ్బంది పాల్గొని టంగుటూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

సంక్షేమం, అభివృద్ధి రెండుకళ్లుగా..

కొత్తపేట: అభివృద్ధి, సంక్షేమం రెండుకళ్లుగా రాష్ట్రంలో పాలన సాగుతుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని కొత్తపేట సచివాలయం–2 పరిధిలో ఎమ్మెల్యే జగ్గిరెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని ప్రతి ఇంటికీ వెళ్లి సీఎం జగన్ అయినప్పటి నుంచి నేటి వరకు అందించిన సంక్షేమ పథకాల వివరాలను వివరించి, ఏమైనా సమస్యలు ఉంటే చెప్పాలని వాటిని అధికారుల దృష్టికి తీసుకెళ్లి సాధ్యమైనంత త్వరగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఎక్కడికక్కడ మహిళలు హారతులు ఇచ్చి అభిమానాన్ని చాటుకున్నారు. మళ్లీ ఇక్కడ మీరు ఎమ్మెల్యేగా జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా విజయం సాధిస్తారని జగ్గిరెడ్డికి భరోసా ఇచ్చారు. మండల పరిషత్ నిధులు రూ.10 లక్షలతో నిర్మించిన తాళ్లమ్మగుడి నుంచి పనసలదొడ్డి రోడ్డును జగ్గిరెడ్డి ప్రారంభించారు. కార్యక్రమాల్లో అముడా చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు, ఎంపీపీ మార్గన గంగాధరరావు, జెడ్పీటీసీ గూడపాటి రమాదేవి, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు ముత్యాల వీరభద్రరావు, ఎంపీటీసీ చావలి సుబ్బారాయ శాస్త్రి, అవిడి సర్పంచ్ రెడ్డి చంటి, గ్రామ పార్టీ అధ్యక్షుడు సలాది బ్రహ్మాజీ తదితరులు పాల్గొన్నారు.

షాపుల వేలంతో పంచాయతీకి రూ.11.37 లక్షల ఆదాయం

రావులపాలెం: స్థానిక గ్రామ పంచాయతీకి చెందిన షాపింగ్ కాంప్లెక్స్‌లను బుధవారం అధికారులు వేలం నిర్వహించారు. సర్పంచ్ తాడేపల్లి నాగమణి, ఉప సర్పంచ్ గొలుగూరి మునిరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ వేలంలో పలువురు వ్యాపారులు ఆయా షాపులను వ్యాపార అవసరాల నిమిత్తం పాడుకోగా పంచాయతీకి నెలకి రూ.11,37,206 ఆదాయం సమకూరుతున్నట్టు పంచాయతీ కార్యదర్శి ఎల్.దుర్గాప్రసాద్ తెలిపారు. మహాత్మా గాంధీ షాపింగ్ కాంప్లెక్స్, డైలీ మార్కెట్ల వద్ద మొత్తం 79 షాపులకు గాను 25 షాపులకు హైకోర్టు స్టే ఇవ్వడంతో 53 షాపులకు అధికారులు మూడు సంవత్సరాల కాలంతో వేలం నిర్వహించారు. ఈ పాటలో షాపులు దక్కించుకున్న వారికి మూడు సంవత్సరాల అనంతరం 10% పెంచి మరో మూడు సంవత్సరాలు మొత్తంగా ఆరు సంవత్సరాల కాల పరిమితికి వేలం నిర్వహించారు. అత్యధికంగా ఒక షాపుకు రూ.70 వేలు పలకగా అత్యల్పంగా రూ.7 వేలు పలకడం విశేషం. అలాగే కోర్టు వివాదం పరిష్కారమైన తర్వాత మిగిలిన షాపులకు కూడా వేలం నిర్వహించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు.